Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

సీఈసీపై ఇండియా కూటమి 'ప్రజా అభిశంసన'.. బీజేపీ గెలుపు చట్టవిరుద్ధమన్న రాహుల్
2



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 197 | పేజీలు : 8 | నవంబర్ 1 ఆదివారం 2026 | వెల రూ. 4.00/-
NALGONDA | VOL:3 | ISSUE: 197 | PAGES:8 | SUNDAY NOVEMBER 1 2026 | Rs. 4:00

తేని జైలు ఘటనపై సీఎం విజయ్ సీరియస్.. అధికారులకు కీలక ఆదేశాలు



తేని జైలు నుంచి 17 మంది ఖైదీలు పరారైన ఘటన

జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌పై సస్పెన్షన్ వేటు

మరో సీనియర్ అధికారి బదిలీ, 9 మంది సిబ్బంది సస్పెండ్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలని హెచ్చరిక

తమిళనాడులోని తేని జిల్లా జైలు నుంచి 17 మంది విచారణ ఖైదీలు పరారైన ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఈ ఘటనలో బాధ్యులను చేస్తూ తేని జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌ను సస్పెండ్ చేయగా, మరో సీనియర్ అధికారిని బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లలో భద్రతను కట్టుదిట్టం చేయాలని, నిఘాను పటిష్ఠం చేయాలని

(మిగతా 2వ పేజీలో..

ప్రభుత్వ భూముల విక్రయానికి రేవంత్ సర్కార్

రూ.1.5 లక్షల కోట్ల విలువైన భూములను విడతలవారీగా అమ్ముతాం

మియాపూర్‌లో 550 ఎకరాల విక్రయానికి సన్నాహాలు

భూములను నగదుగా మార్చి రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తాం

కేసీఆర్ కంటే తానే శ్రీమంతుడినన్న ముఖ్యమంత్రి

హైస్పీడ్ రైలు, కొత్త రైల్వే మార్గాలపై కేంద్ర మంత్రితో చర్చలు




హైదరాబాద్, అక్టోబరు 30: రాష్ట్రంలో ప్రభుత్వ భూముల విక్రయానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. వివిధ ప్రాంతాల్లో న్యాయపరమైన చిక్కులు తొలగిన భూములను విడతలవారీగా విక్రయించి నిధులు సమకూర్చుకోవాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మియాపూర్‌లోని 550 ఎకరాల భూములతో పాటు రాష్ట్రంలోని ఏడు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను విక్రయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లలో రూ.1.5 లక్షల కోట్ల విలువైన భూములను కాపాడామని, వాటిని అవసరాలకు అనుగుణంగా విక్రయిస్తామని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు.

రూ.50 వేల కోట్ల భూముల విక్రయానికి సన్నాహాలు

మియాపూర్‌లోని 550 ఎకరాల భూమితో పాటు మరో ఆరు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములపై న్యాయపరమైన చిక్కులు తొలగినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. వీటి విక్రయ ప్రక్రియను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని రిసోర్సెస్ మొబిలైజేషన్ సబ్ కమిటీ పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. వీలైనంత త్వరగా విక్రయ ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వ అవసరాలకు నిధులు

(మిగతా 2వ పేజీలో..)

మధ్యంతర ఎన్నికల్లో పరాభవం ఎదురైతే ఇరాన్‌కు మూడినట్లేనా? ట్రంప్ ప్లాన్స్ ఏంటి?



రిపబ్లికన్లు ఓడితే ఇరాన్‌పై భారీ దాడికి ట్రంప్ మొగ్గు చూపవచ్చని సమాచారం

ఎన్నికల ఫలితాలకు ఇరాన్ నిర్ణయాలకు సంబంధం లేదన్న వైట్‌హౌస్

ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లో దాడులకు సిద్ధంగా ఉన్న అమెరికా బలగాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి భారీ సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. నవంబర్ 3న జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఘోర పరాజయం ఎదుర్కొంటే, ట్రంప్ మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉందని ఓ అమెరికా అధికారి వెల్లడించినట్లు ఆక్సియోస్ కథనాన్ని ఉటంకిస్తూ న్యూస్18 పేర్కొంది. అయితే ఎన్నికల ఫలితాలు ఇరాన్‌పై నిర్ణయాలను ప్రభావితం చేయవని వైట్‌హౌస్ అధికారి ఈ వాదనను తోసిపుచ్చారు. రిపబ్లికన్లు ఎన్నికల్లో భారీగా నష్టపోతే ట్రంప్ తన రాజకీయ ప్రతిష్ఠకు భంగం కలిగిందని భావించి ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకోవచ్చని ఓ అమెరికా అధికారి చెప్పినట్లు నివేదిక తెలిపింది. ఈ సందేశాన్ని ఇరాన్ అధికారులకు కూడా చేరవేస్తున్నారని పేర్కొంది. ఒప్పందం కుదుర్చుకోవడానికి

(మిగతా 2వ పేజీలో..)

ఎల్‌నినో ఎఫెక్ట్.. తాగునీటి కోసం రూ.120 కోట్లు.. మంత్రి సీతక్క కీలక నిర్ణయం



ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు

నాలుగు జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయానికి రూ.120 కోట్లు

ఇతర జిల్లాలకు ఒక్కోటి రూ.కోటి చొప్పున నిధులు

బోరుబావులు, ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఏర్పాట్లు

స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని ఆదేశం

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు ఆమోదించినట్లు తెలిపారు.రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు.చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు,

(మిగతా 2వ పేజీలో..)

ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా?: ఐడీబీఐ డీల్‌పై కేటీఆర్ ఫైర్

బ్యాంకు ఆస్తుల విలువను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తున్నారని ఆరోపణ

రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వస్తే నిబంధనలు మార్చడంపై ప్రశ్నలు

ఉద్యోగుల ఆందోళనలను కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపాటు



ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు జాతి సంపదని, వాటి విలువను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి అమ్మజూపడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. "ఐడీబీఐ బ్యాంకు విలువను తక్కువగా అంచనా వేస్తున్నారనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వచ్చినప్పుడు నిబంధనలు, మదింపు పద్ధతులను ఎందుకు మార్చారు? ఐడీబీఐ ఉద్యోగులు లేవనెత్తుతున్న ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు?"

(మిగతా 2వ పేజీలో..)

రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్..భూములను కాపాడిందే బీఆర్ఎస్ : మాజీ మంత్రి హరీష్‌రావు



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మియాపూర్ భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ ా నిలిచిపోనున్నారని దుయ్యబట్టారు. సీఎంకు అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని వ్యాఖ్యనించారు.మియాపూర్ భూములు తెలంగాణ ప్రభుత్వానికి చెందినవేనని సుప్రీంకోర్టు వెల్లడించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అబద్ధాలతో క్రెడిట్ చోరీలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మియాపూర్ భూముల విషయంపై సుప్రీం కోర్టు జడ్జిమెంట్ కాపీ కూడా ఇంకా రాకముందే ఆ భూములను అమ్ముకోవాలనే ఆతృత సీఎంలో కనిపించిందని ఆరోపించారు.కేసీఆర్ సీఎం అయ్యాక వైద్యనాథన్ అనే సీనియర్ అడ్వకేట్‌ను నియమించి భూములు ప్రభుత్వానికి దక్కేలా న్యాయపోరాటం చేసి కాపాడారని గుర్తు చేశారు. మంచిరేవులలో 142 ఎకరాలు కాపాడామని గొప్పలు చెప్పుకుంటే కాంగ్రెస్ ఆ భూములు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేలా ప్రయత్నించిందని పేర్కొన్నారు. మంచిరేవుల్లోని 10 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని విమర్శించారు. భూపాలపల్లి భూములు, హయాత్‌నగర్‌లోని భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ అన్నిరకాలుగా కాపాడిందని ఆరోపించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లను రేవంత్ రెడ్డి అప్పుగా తెచ్చుకున్నారని వెల్లడించారు.

(మిగతా 2వ పేజీలో..)

ఇస్రో ప్రయోగం సక్సెస్.. శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు

జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహం విజయవంతం

ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ప్రధాని మోదీ అభినందనలు

స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్' బలోపేతం అవుతుందని వెల్లడి

కీలక సాంకేతికతల్లో ఆత్మనిర్భరతకు ఈ ప్రయోగం దోహదపడుతుందని వ్యాఖ్య

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో అద్భుత విజయం చేరింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల బృందాన్ని ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్

(మిగతా 2వ పేజీలో..)



తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో ఐదు రోజుల వర్ష సూచన

నేటి నుంచి నవంబర్ 4 వరకు వానలు కురిసే అవకాశం

హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి తెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

తేని జైలు ఘటనపై సీఎం విజయ్ సీరియస్.. అధికారులకు కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి విజయ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. తేని జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌ను అక్టోబర్ 30 నుంచి తదుపరి ఆదేశాలు జారీ చేసేంతవరకు సస్పెండ్ చేశారు. అదేవిధంగా మధురై సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న ఆర్. కృష్ణరాజ్‌ను సేలం సెంట్రల్ జైలుకు బదిలీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని సీఎం విజయ్ హెచ్చరించారు.అక్టోబర్ 26న తేని జిల్లాలోని టెక్కంపట్టి సబ్-జైలులో ఈ ఘటన జరిగింది. వైద్యపరమైన అత్యవసర పరిస్థితిని సృష్టించిన ఖైదీలు, జైలు గార్డులపై దాడి చేసి, వారి నుంచి తాళాలు లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు, ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పరారైన 17 మందినీ తిరిగి పట్టుకున్నారు. ఈ జైలు బ్రేక్ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల భద్రతపై ప్రభుత్వం సమీక్ష ప్రారంభించింది. ఇప్పటికే ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై 9 మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిఘా వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు.

సీఈసీపై ఇండియా కూటమి 'ప్రజా అభిశంసన'.. బీజేపీ గెలుపు చట్టవిరుద్ధమన్న రాహుల్

13.3 కోట్ల ఓట్లను జాబితా నుంచి తొలగించారని రాహుల్ గాంధీ ఆరోపణ

2024 లోక్‌సభ ఎన్నికలు చట్టవిరుద్ధమని, బీజేపీ గెలుపు అక్రమమని వ్యాఖ్య

ప్రభుత్వం దేశ ఆత్మపై దాడి చేస్తోందని మల్లికార్జున ఖర్గే విమర్శ

ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా 19 విపక్ష పార్టీల నిరసన

2024 లోక్‌సభ ఎన్నికల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. భారీ ఎత్తున ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేశారని, బీజేపీ ఎంపీలు అక్రమంగా లోక్‌సభలో అడుగుపెట్టారని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి శనివారం నిర్వహించిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమంలో రాహుల్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఏర్పాటు చేసిన ఈ మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "దేశవ్యాప్తంగా సుమారు 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారు. ఇది మొత్తం ఓటర్లలో దాదాపు 15 శాతానికి సమానం. అనేక నియోజకవర్గాల్లో గెలుపు మార్జిన్ కేవలం 3 శాతం మాత్రమే ఉన్నప్పుడు, ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించడం ఎన్నికల నిష్పాక్షికతపై తీవ్రమైన సందేహాలు రేకెత్తిస్తోంది" అని అన్నారు."2024 లోక్‌సభ ఎన్నికలు చట్టవిరుద్ధంగా జరిగాయని, బీజేపీ సభ్యులు అక్రమంగా పార్లమెంటులోకి ప్రవేశించారని స్వయంగా ఎన్నికల సంఘమే పరోక్షంగా అంగీకరిస్తోంది" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్న నాయకత్వం తనను కాపాడుతుందని సీఈసీ భావిస్తే పొరపాటని, ప్రజల ఆగ్రహాన్ని గమనించాలని హెచ్చరించారు. "మీరు ఓట్ల దొంగతనానికి సహకరిస్తూనే ఉండండి. కానీ వీధుల్లో ఉన్న ప్రజలు మీరు వారికి చేసిన ద్రోహాన్ని ఎప్పటికీ మర్చిపోరని నేను హామీ ఇస్తున్నాను" అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించారు. సీఈసీకి వ్యతిరేకంగా లాంఛనప్రాయ ప్రజా అభిశంసనను ఖర్గే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశ ఆత్మపైనే దాడి చేస్తోందని, పార్లమెంటులో మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు కనీస అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా తమ నిరసనను తెలియజేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఇండియా కూటమి నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 19 రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూముల విక్రయానికి రేవంత్ సర్కార్ సిద్ధం!

మొదటి పేజీ తరువాయి)

సమకూర్చుకోవాలని భావిస్తున్నట్లు చెప్పారు.

విడతలవారీగా భూముల విక్రయం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు రూ.1.5 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు రేవంత్‌రెడ్డి వివరించారు. గచ్చిబౌలి, మామిడిపల్లిలో ఐఎంజీ భారత్‌కు సంబంధించిన 800 ఎకరాల భూములు, కొండాపూర్‌లో 36 ఎకరాలు, మంచిరేవులలో 143 ఎకరాలను పరిరక్షించినట్లు తెలిపారు. మంచిరేవులలోని భూముల్లో ఒక పాఠశాలకు స్థలం కేటాయించినట్లు పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లాలోనూ 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని చెప్పారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని భూములకు అవసరమైన చోట లేఅవుట్లు రూపొందించి విక్రయిస్తామని, భూములను నగదుగా మార్చి రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ సహకరించాలని కోరారు.

కేసీఆర్ కంటే తానే శ్రీమంతుడినన్న సీఎం

రాజకీయ అంశాలపై స్పందించిన రేవంత్‌రెడ్డి, తాను కేసీఆర్ కంటే కూడా శ్రీమంతుడినని వ్యాఖ్యానించారు. చిన్ననాటి నుంచే ఆర్థికంగా బాగానే ఉన్నానని చెప్పారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కాంగ్రెస్, అనుబంధ సంస్థల నాయకులకు కీలక పదవులు కల్పించినట్లు తెలిపారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్ పేరును ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకే నిర్ణయాలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టని పనులను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని, అందుకే అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

హైస్పీడ్ రైలు పనులు వేగవంతం చేయాలి

తెలంగాణకు ప్రతిపాదించిన హైస్పీడ్ రైలు కారిడార్ల పనులను వేగవంతం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను ఇంకా ప్రారంభించలేదని కేంద్ర మంత్రి ప్రస్తావించగా, కేంద్రం అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలిపిన తర్వాత భూసేకరణ చేపడతామని ముఖ్యమంత్రి వివరించారు.

కొత్త రైల్వే మార్గాలకు విజ్ఞప్తి

వికారాబాద్-కృష్ణా కొత్త రైల్వే మార్గాన్ని మంజూరు చేయాలని, హైదరాబాద్ చుట్టూ నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డు పక్కనే రీజినల్ రింగ్ రైలు అలైన్‌మెంట్ రూపొందించాలని రేవంత్‌రెడ్డి కోరారు. డోర్నకల్-గద్వాల్, కల్వకుర్తి-మాచర్ల, కాచిగూడ-జగ్గయ్యపేట, పటాన్‌చెరు-ఆదిలాబాద్, బోధన్-లాతూర్ రైల్వే మార్గాలతో పాటు అక్కన్నపేట బైపాస్ లైన్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ సమీపంలోని అనంతారంలో మెగా కోచింగ్, ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు.

కేంద్ర మంత్రితో సమావేశంలో పలువురు

రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులు, కొత్త మార్గాల ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, వంశీకృష్ణ, అనిల్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా?: ఐడీబీఐ డీల్‌పై కేటీఆర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన నగరాల్లో బ్యాంకుకు అత్యంత విలువైన భూములు, స్థిరాస్తులు ఉన్నాయని, వాటి విలువను సరిగ్గా లెక్కించారా? లేదా? అని నిలదీశారు. "ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేటుపరం చేసే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలి. ఇంత తొందర ఎందుకు?" అని ఆయన అన్నారు.

తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

మొదటి పేజీ తరువాయి)

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నేటి నుంచి నవంబర్ 4వ తేదీ వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది.వాతావరణ శాఖ నివేదిక ప్రకారం, అల్పపీడనం వాయుగుండంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోంది. దీని ప్రభావంతో ఈరోజు సాయంత్రం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడతాయని అంచనా వేసింది. ముఖ్యంగా నవంబర్ 2, 3 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నవంబర్ 2న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో, నవంబర్ 3న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు సూచించారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. తాగునీటి కోసం రూ.120 కోట్లు.. మంత్రి సీతక్క కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి)

బావులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సీతక్క సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఉన్న ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి నీరు చేరేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మధ్యంతర ఎన్నికల్లో పరాభవం ఎదురైతే ఇరాన్‌కు మూడినట్లేనా? ట్రంప్ ప్లాన్స్ ఏంటి?

మొదటి పేజీ తరువాయి)

ఇదే సరైన సమయమని వారికి చెబుతున్నట్లు వివరించింది.మరోవైపు, అమెరికా-ఇరాన్ మధ్య చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ మధ్యవర్తులు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం టెహ్రాన్‌లో 12 గంటలకు పైగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ చర్చల్లో కొంత సానుకూల పురోగతి కనిపించిందని ఓ దౌత్యవేత్త పేర్కొన్నారు. శనివారం దోహాలోనూ చర్చలు కొనసాగనున్నాయి. అణు కార్యక్రమంపై రాయితీలు ఇవ్వాలని అమెరికా కోరుతుండగా.. ముందుగా నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని, నిలిపివేసిన నిధులను విడుదల చేయాలని, చమురు విక్రయాలకు అనుమతించాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లోనే ఇరాన్‌పై కొత్త సైనిక చర్యలు ప్రారంభించేందుకు అమెరికా బలగాలు సిద్ధంగా ఉన్నాయని ఇటీవల సీఎన్ఎన్ కథనం వెల్లడించింది. ఇరాన్‌లోని ఇంధన వనరులు, సైనిక స్థావరాలు, అణు కేంద్రాలు లక్ష్యంగా దాడులు జరిగే అవకాశం ఉందని అమెరికా అధికారులను ఉటంకించింది. అయితే తుది నిర్ణయం ట్రంప్ తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేసింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే దాడులకు సంబంధించి ట్రంప్ నుంచి ఇప్పటివరకు తుది ఆదేశాలు వెలువడలేదు.

ఇస్రో ప్రయోగం సక్సెస్.. శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు

మొదటి పేజీ తరువాయి)

'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "జీఎస్ఎల్వీ-ఎఫ్18 ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు నా అభినందనలు. మన స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్'ను బలోపేతం చేయడంలో ఈ ప్రయోగం ఒక ముఖ్యమైన ముందడుగు" అని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక సామర్థ్యాలతో కూడిన ఈ ఉపగ్రహం, కీలక సాంకేతికతల్లో దేశం ఆత్మనిర్భరత సాధించేందుకు మరింత దోహదపడుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన నావిగేషన్ సేవలు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. మన అంతరిక్ష శాస్త్రవేత్తల అంకితభావం, నైపుణ్యం దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయని మోదీ కొనియాడారు.'నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టలేషన్' (నావిక్) అనేది భారత్ సొంతంగా అభివృద్ధి చేసుకున్న ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థ. అమెరికాకు చెందిన జీపీఎస్ తరహాలోనే ఇది పనిచేస్తుంది. దేశ భద్రత, రవాణా, విపత్తుల నిర్వహణ, పౌర సేవలు వంటి అనేక రంగాల్లో కచ్చితమైన పొజిషనింగ్, టైమింగ్ సేవలను అందించడం దీని లక్ష్యం.ప్రస్తుతం ప్రయోగించిన ఎన్‌వీఎస్-03, నావిక్ కోసం రూపొందించిన రెండో తరం ఉపగ్రహాల్లో ఒకటి. ఇది నావిక్ వ్యవస్థకు మరింత శక్తిని అందించి, దాని సేవలను మరింత విస్తృతం చేయనుంది. ఈ ఉపగ్రహంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన అటామిక్ క్లాక్ ఉండటం విశేషం. ఈ విజయంతో అంతరిక్ష రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో కీలక ముందడుగు వేసినట్లయింది.

దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి







- **విచ్ఛిన్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి -- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**
- **జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా అధికారులతో ప్రతిజ్ఞ**

నల్గొండ జిల్లా అక్టోబర్ 31 (నేటి వెలుగు)

భారతదేశ సమైక్యతను, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.భారత ఉక్కుమనిషి, దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఐక్యత దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ యువకుడిగా ఉన్నప్పటి నుంచే భారత స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారని, మహాత్మా గాంధీ పిలుపుతో సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాల విలీనంలో ఆయన కీలక పాత్ర పోషించారని, ముఖ్యంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో చూపిన దూరదృష్టి, ధైర్యసాహసాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలకు గుర్తుగా గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా జిల్లాలో కెవాడియాలో నర్మదా నది ఒడ్డున ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా నుంచి ఒక ప్రతినిధి బృందం కెవాడియాకు వెళ్లినట్లు వెల్లడించారు.దేశాన్ని, సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించే శక్తుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అలాంటి ప్రయత్నాలను ఐక్యంగా తిప్పికొట్టాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, సమగ్రత, భద్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని పునరుద్ఘాటించారు.అనంతరం రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ మోతిలాల్, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విధానంలో జనగణన--2027 నిర్వహణకు సన్నాహాలు





- **జనాభా గణన రెండో విడతను తప్పులు లేకుండా, బాధ్యతాయుతంగా నిర్వహించాలి**
- **అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట, అక్టోబర్ 31(నేటి వెలుగు):

సూర్యాపేట జిల్లాలో జనగణన--2027 రెండో విడత శిక్షణ కార్యక్రమం శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు.భారతదేశంలో తొలిసారిగా జనగణన--2027ను డిజిటల్ విధానంలో నిర్వహించనున్న నేపథ్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఖచ్చితమైన జనాభా వివరాలను సేకరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.ఈ శిక్షణలో డిజిటల్ విధానంలో సమాచార నమోదు, ఎన్యూమరేషన్ బ్లాకుల ఏర్పాటు, సబ్‌బ్లాకుల విభజన, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జనాభా గణన విధానాలు, సాంకేతిక అంశాలు, సమాచార సేకరణపై జిల్లా జనగణన ఇన్‌చార్జి ఇస్లావత్ హాబలాల్, మాస్టర్ ట్రైనర్ వై. జంగయ్య శిక్షణ అందించారు.జనగణన రెండో విడతలో ప్రతి వ్యక్తికి సంబంధించిన వివరాలను 40 ప్రశ్నల ద్వారా సేకరించనున్నట్లు అధికారులు వివరించారు. కేటాయించిన ఎన్యూమరేషన్ బ్లాకుల పరిధిలో ప్రతి ఒక్కరి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం, బ్లాకుల విభజనను సక్రమంగా చేపట్టడం, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం గణన ప్రక్రియను పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు జనాభా గణనకు ముందు 15 రోజుల పాటు స్వీయ గణన ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమయంలో ప్రజలు తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకొని జనగణన విజయవంతానికి సహకరించాలని కోరారు.జనగణన ద్వారా సేకరించే ఖచ్చితమైన జనాభా సమాచారం భవిష్యత్తులో ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జనగణన--2027 రెండో విడతను విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు కూడా చురుకుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా, అదనపు జిల్లా జనగణన అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు (), తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, జిల్లా జనాభా గణన అధికారి ఎల్. కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ లోని అన్ని డివిజన్ లో అభివృద్ధి కార్యక్రమాలు

నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి

నల్గొండ అక్టోబర్ 31 నేటి వెలుగు




నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని అన్ని డివిజన్ లను అభివృద్ధి చేయడం జరుగుతుందని నగర శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు.శనివారం జరిగిన సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని డివిజన్లను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ఇప్పటికే కోట్లాది రూపాయలతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. డివిజన్లో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు డివిజన్లోని పలు కాలనీలో నెలకొన్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకురాగా అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రఖ్ అలీ అమేర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు



బియ్యం ధరలపై కీలక నిర్ణయం

- **నిర్ణయించిన ధరలకే విక్రయించాలి.. అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు!**
- **కలెక్టర్ (పౌర సరఫరాలు) డి. విజయేందర్ రెడ్డి హెచ్చరిక**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అక్టోబర్ 31 నేటి వెలుగు



తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కమిషనర్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో బియ్యం గరిష్ట విక్రయ ధరలను నిర్ణయించారు.
నిర్ణయించిన గరిష్ట ధరలు:
తెలంగాణ బిపి బియ్యం -- కిలో రూ.66
తెలంగాణ సోనా బియ్యం -- కిలో రూ.74
తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం -- కిలో రూ.79
రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, రిటైల్ వ్యాపారులు నిర్ణయించిన ధరలకు మించి బియ్యం విక్రయించరాదని కలెక్టర్ (పౌర సరఫరాలు) డి. విజయేందర్ రెడ్డి స్పష్టం చేశారు.వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా ప్రతి రిటైల్, హోల్‌సేల్ బియ్యం వ్యాపారి తమ దుకాణం ముందు ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరలను స్పష్టంగా కనిపించేలా బ్యానర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందించడమే లక్ష్యమని, వ్యాపారులందరూ ప్రభుత్వ నిర్ణయాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి

- **దేశ ఐకమత్యం, సమగ్రతకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయం**
- **రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా ప్రతిజ్ఞ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, అక్టోబర్ 31:

భారతదేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు మరువలేనివని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతితో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కలెక్టరేట్ అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు.దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో కృషి చేస్తామని, తోటి వారిలోనూ ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికతతో దేశానికి సమకూరిన అంతర్గత భద్రతను మరింత పటిష్టపరిచేందుకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సీతారాం, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాలియా మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడిగా నంద్యాల వేణు

తిరుమలగిరి మండల బీజేపీ అధ్యక్షుడిగా సభావత్ రాంజీ నియామకం

నల్గొండ, అక్టోబర్ 31 (నేటి వెలుగు)



భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా హాలియా మున్సిపాలిటీ, తిరుమలగిరి మండలానికి నూతన అధ్యక్షులను నియమించారు. హాలియా మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడిగా నంద్యాల వేణును, తిరుమలగిరి మండల బీజేపీ అధ్యక్షుడిగా సభావత్ రాంజీని నియమించినట్లు బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, పార్టీ ఆశయాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.. ఈ కార్యక్రమంలో కంకణాల శ్రీధర్ రెడ్డి, నివేదిత, జిల్లా నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు..

నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ మహా పాదయాత్ర

- **అమిత్ షా నేతృత్వంలో 'లోక్ తంత్ర బచావో -- అరాచకత్వ హటావో' యాత్ర**
- **మహా పాదయాత్రను జయప్రదం చేయాలి -- బీజేపీ నాయకుడు పాలకురి రవి గౌడ్ పిలుపు**

నల్గొండ, అక్టోబర్ 31 (నేటి వెలుగు)




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన 'లోక్ తంత్ర బచావో -- అరాచకత్వ హటావో మహా పాదయాత్ర'ను విజయవంతం చేయాలని బీజేపీ నాయకుడు పాలకురి రవి గౌడ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మహిళలు, రైతులు, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ మహా పాదయాత్ర చేపట్టిందని తెలిపారు. నవంబర్ 2, 2026న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ నుంచి ఎంజే మార్కెట్ ఎక్స్ రోడ్డు వరకు మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు.నల్గొండ జిల్లా నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహా పాదయాత్రను విజయవంతం చేయాలని పాలకురి రవి గౌడ్ కోరారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

మియాపూర్‌లో ఉన్న ప్రభుత్వ భూములను నిరుపేద బీసీలకు వినియోగించాలి

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ రాసి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాతుల లింగం గౌడ్**

హైద్రాబాద్ అక్టోబర్ 31 (నేటి వెలుగు)



మియాపూర్‌లో ఉన్న ప్రభుత్వ భూములను విక్రయించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని,ఆ భూములను నిరుపేద బీసీ కుటుంబాల సంక్షేమానికి వినియోగించాలని కోరుతూ ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లేఖ రాసి విజ్ఞప్తి చేసినట్టు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు.ప్రభుత్వ భూములు అనేవి ప్రజలందరికీ చెందిన విలువైన ఆస్తులని, వాటిని విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి తాత్కాలికంగా ఆదాయం సమకూరవచ్చేమో కానీ, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విలువైన భూములను కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేద బీసీ కుటుంబాలు సొంత ఇల్లు,నివాస స్థలం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అలాంటి పేద కుటుంబాలకు ప్రభుత్వ భూములను కేటాయించి గృహ నిర్మాణానికి అవకాశం కల్పించాలని కోరారు.ముఖ్యంగా మియాపూర్‌లోని ప్రభుత్వ భూముల్లో కొంత భాగాన్ని నిరుపేద బీసీలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించడంతో పాటు,బీసీ విద్యార్థుల కోసం హాస్టళ్లు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు కోచింగ్ సెంటర్లు బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ప్రజా సంక్షేమం,సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ భూముల వినియోగంలో ప్రాధాన్యతగా ఉండాలని, నిరుపేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని జాజుల లింగం గౌడ్ కోరారు.

పోలీస్ శాఖ కమర్షియల్ స్థలం అభివృద్ధి, లీజుకు ప్రతిపాదనల ఆహ్వానం

- **ఆసక్తి గల వ్యక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
- **జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్**

నల్లగొండ, అక్టోబర్ 31(నేటి వెలుగు):



నల్లగొండ పట్టణంలోని పోలీస్ శాఖకు చెందిన వాణిజ్య అవసరాలకు అనువైన ఖాళీ స్థలాన్ని అభివృద్ధి చేయడంతో పాటు లీజుకు తీసుకునేందుకు ఆసక్తి గల వ్యక్తుల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు.నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో ఇషా గ్రాండ్ ఎదురుగా నూతనంగా నిర్మాణంలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాన్ని వాణిజ్యపరంగా అభివృద్ధి చేసి



వినియోగించుకునేందుకు ఆసక్తి గల వ్యక్తులు తమ ప్రతిపాదనలు సమర్పించాలని ఎస్పీ సూచించారు.ఈ అవకాశాన్ని ఆసక్తి గల వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. స్థల అభివృద్ధి, లీజుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం పోలీస్ శాఖ వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్‌ను సంప్రదించాలని సూచించారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 8712670169 ఆసక్తి గల వ్యక్తులు మరిన్ని వివరాలు తెలుసుకొని తమ ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కోరారు.

కక్షపూరిత చర్యలు మానుకోవాలి

- **ఎలక్ట్రికల్ బస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి**
- **మూడు గంటలు బస్సులు నిలిపివేత నిరసన తెలిపిన డ్రైవర్లు**

నల్గొండ అక్టోబర్ 31 (నేటి వెలుగు)



నల్గొండ డిపోలో ఎలక్ట్రికల్ బస్సులు నడుపుతున్న డ్రైవర్ల పై కక్షపూరితంగా వివరిస్తున్న జేబీఎం సిస్కాన్ మ్యాన్ పవర్ సంస్థ ప్రతినిధుల తీరును నిరసిస్తూ తెల్లవారుజామున 4 గంటల నుండి ఎలక్ట్రికల్ బస్సులు నిలిపివేసి డ్రైవర్లు నిరసన తెలిపారు.శనివారం నల్గొండ డిపో ముందు ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్ల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం మాట్లాడుతూ 16 నెలలుగా పనిచేస్తున్న ఎలక్ట్రికల్ బస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని యూనియన్ ఏర్పాటు చేసుకున్నందుకు యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. డ్రైవర్ల ఎలాంటి తప్పులు లేకున్న డ్యూటీలు ఇవ్వకుండా ఆపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సూర్యాపేట వరంగల్ డిపోలలో పిఎఫ్ ఈఎస్ఐ తో కలిపి 26000 వేతన ఇస్తుండగా నల్గొండలో 20000 మాత్రమే ఇస్తూ శ్రమదోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. వేతనాలు ఇతర సమస్యలు పరిష్కరించాలని అనేకమార్లు వినతి పత్రాలు ఇచ్చిన యాజమాన్యం స్పందించకపోగా యూనియన్ లీడర్లుగా ఉన్న డ్రైవర్లను వేధింపులకు గురి చేస్తూ డ్యూటీలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తక్షణమే డ్యూటీ నిలిపివేసిన సోమయ్య ,మురళి, కృష్ణారెడ్డి మరో 15 మందిని విధుల్లోకి తీసుకోవాలని వేతనాలు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జేబీఎం సిస్కాన్ నల్గొండ డిపో ప్రతినిధులు సాయి కిరణ్ కత్తుల యాదయ్య జోక్యం చేసుకొని హెడ్ ఆఫీస్ వారితో మాట్లాడి నాలుగో తేదీ జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని అందులో వేతనాలు ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన తదుపరి సమ్మె విరమించి యధావిధిగా విధుల్లోని చేరినారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నల్గొండ డిపో అధ్యక్షులు కాసాన్ రమేష్ కార్యదర్శి పొట్టపాంగి గణేష్ కోశాధికారి పూల సోమన్న నాయుడు, ఉపాధ్యక్షుడు సింగపంగా మురళి మచ్చ నాగార్జున జల్లుల వీరారెడ్డి బొడ్డుపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు



నల్లగొండ అభివృద్ధిలో మరో ముందడుగు





- **క్లాక్ టవర్ సెంటర్ సుందరీకరణకు రూ.197.44 కోట్లు**
- **సుందరీకరణ నమూనాను ఆవిష్కరించిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి**
- **సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి కోమటిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మేయర్**

నల్లగొండ అక్టోబర్ 31 నేటి వెలుగు:

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని క్లాక్ టవర్ సెంటర్ సుందరీకరణకు ప్రభుత్వం రూ.197.44 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నిధులతో క్లాక్ టవర్ సెంటర్ ను ఆధునిక హంగులతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్ లో క్లాక్ టవర్ సెంటర్ సుందరీకరణ నమూనా మోడల్ ను డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమేర్, కార్పొరేట్లలతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్లాక్ టవర్ సెంటర్ సుందరీకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం నల్లగొండ నగర అభివృద్ధిలో కీలక ముందడుగని పేర్కొన్నారు. కార్పొరేషన్ కు మరింత ఆధునిక రూపాన్ని తీసుకురావడానికి ఈ ప్రాజెక్టు మరింత దోహదపడుతుందని తెలిపారు.స్మార్ట్ సిటీలో భాగంగా పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ సుందరీకరణకు రూ.197.44 కోట్లు మంజూరైనట్లు వివరించారు. క్లాక్ టవర్ సెంటర్ ను అధునాతన రీతిలో అభివృద్ధి చేయడానికి ప్రపంచ బ్యాంకు రూ. 138.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.59.23 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన ఆమోదం తెలిపిందని వెల్లడించారు.ఈ ప్రాజెక్టులో భాగంగా షాపింగ్ కాంప్లెక్స్ ను అభివృద్ధి చేయడం ద్వారా వాణిజ్య కార్యకర్తలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, నగర ప్రజలకు మెరుగైన షాపింగ్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. క్లాక్ టవర్ సెంటర్ అభివృద్ధిలో భాగంగా మల్టీప్లెక్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించామని, దీనివల్ల నగర ప్రజలకు వినోద సౌకర్యాలు మరింత చేరువవుతాయని అన్నారు. దీని ద్వారా కొత్త ఆకర్షణ తీసుకురావడంతో పాటు నగర ప్రతిష్టను మరింత పెంచేందుకు కృషి చేస్తామన్నారు.షాపింగ్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్ వంటి సదుపాయాల అభివృద్ధితో స్థానిక వ్యాపారాలకు ప్రోత్సాహం లభించడంతో పాటు నగర ఆర్థిక కార్యకలాపాలకు కూడా మేలు జరుగుతుందన్నారు. ఇప్పటికే నల్లగొండ పట్టణంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారం కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవలనే పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు, సాగర్ రోడ్డులో వైయస్సార్ విగ్రహం నుంచి చర్ల గౌరారం రోడ్డు వరకు ఆరులైన్ల రోడ్డు విస్తరణకు రూ.20 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అదేవిధంగా 100 కోట్లతో నల్లగొండ పట్టణంలో సయ్యద్ లతీఫుల్ ఖాద్రి గుట్ట, బ్రహ్మంగారి గుట్టలకు ఘాట్ రోడ్లను నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.స్మార్ట్ సిటీలో భాగంగా నల్లగొండ కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నల్గొండ మున్సిపల్ పాలకవర్గం, పట్టణ ప్రజల తరఫున మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్లు కేసాని వేణుగోపాల్ రెడ్డి, గుమ్ముల జానకి మోహన్ రెడ్డి, ఇబ్రహీం,ఆలకుంట్ల నాగరాజు, అబ్బగోని కవితా రమేష్ గౌడ్, బొజ్జ శంకర్, ఏదుళ్ళ శ్రీధర్ రెడ్డి, ఇటికాల మంగమ్మ శ్రీనివాస్, పెరిక స్వాతి , ఆలకుంట్ల ఝాన్సీ,అల్లి సుభాష్ యాదవ్, రేగట్టే అండాలు, పున్న జ్ఞానేశ్వరి, పాలకూరి సుమలత, గోగుల గణేష్, వజ్జ సంతోషిని, గుండెబోయిన పుష్పలత తదితరులు పాల్గొన్నారు

సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు..





- **దేశ ఐక్యత, సమగ్రత, అంతర్గత భద్రత పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత - - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్.**

నల్గొండ జిల్లా అక్టోబర్ 31 (నేటి వెలుగు)

స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని శనివారం నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం అనేక సంస్థానాలను ఏకం చేసి బలమైన, సమైక్య భారతదేశ నిర్మాణానికి విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన దృఢ సంకల్పం, నాయకత్వ లక్షణాలు, దేశం పట్ల అచంచలమైన నిబద్ధత నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. దేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ ప్రజలందరిలో జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం, భద్రతను కాపాడటం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని, దేశ అభివృద్ధి, శాంతిభద్రతలు, సామాజిక సామరస్యానికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ప్రజల భద్రతతో పాటు దేశ అంతర్గత భద్రత పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని దేశ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జాతీయ ఐక్యత సందేశాన్ని సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు చేరవేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్,ఏ. ఓ శివప్రసాద్,ఎస్పి డిఎస్పీ మల్లారెడ్డి, ఏ.ఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, సీఐలు ఆర్.ఐలు,మరియు సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా, దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**